క్లుప్తంగా

ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగరేయండి
బీజేపీ పట్టణాధ్యక్షుడు మల్లేశం


జెండా ఆవిష్కరించి, జాతీయ గీతాన్ని ఆలపిస్తున్న నాయకులు

తాండూరు టౌన్ : ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగరేసి దేశభక్తిని చాటాలని బీజేపీ పట్టణాధ్యక్షుడు నాగారం మల్లేశం అన్నారు. జాతీయ ఐక్యత, జాతీయ సమగ్రత, నేషన్ ఫస్ట్ అనే నినాదంతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపు మేరకు పట్టణంలోని తన ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఆదివారం ఎగరేసి జాతీయ గీతాన్ని ఆలపించినట్లు చెప్పారు. ఈ నెల 15వ తేదీ లోగా ప్రతి భారతీయుడు తన ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగరేసి, జాతీయ సమగ్రతను చాటాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సంగమేశ్వర్, ప్రహ్లాద్, సంతోష్, శేఖర్, ప్రభు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేయండి


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కుల్కచర్ల: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 13న నగరంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ మాదిగ, మండల ప్రధాన కార్యదర్శి కొమ్ము శ్రీనివాస్ అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ.. 30సంవత్సరాల దండోరా పోరాటం విజయాన్ని అందరు సంతోషంగా జరుపుకోవాలన్నారు. ప్రతీ గ్రామం నుంచి భారీ సంఖ్యలో ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు విచ్చేసి ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో బిచ్చయ్య, ఎల్లయ్య, వెంకట్రాములు, ఎల్లయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ డైరెక్టర్‌కు సన్మానం


రాజును సన్మానించిన గ్రామస్తులు

యాలాల: మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియామకమైన మేకల రాజును తిమ్మాయిపల్లి గ్రామస్తులు ఆదివారం కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువాతో సన్మానించారు. గతంలో ఎంపీటీసీగా చేసిన రాజు, ఏఎంసీ డైరెక్టర్‌గా నియామకం కావడం సంతోషం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. సన్మానించిన వారిలో రాజశేఖర్, శ్రీనివాస్, జగదీష్, శ్రీనివాస్, శేఖర్, రాములు, తల్లారాం, మోహన్, నర్సింహులు, వెంకటేశ్, చిన్న రాజశేఖర్ తదితరులున్నారు.

సమియొద్దీన్‌కు సత్కారం
మోమిన్‌పేట: మండలంలోని టేకులపల్లికి చెందిన సమియొద్దీన్ ఐదు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. ఆదివారం మోమిన్‌పేట పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డిని అతని ఘనంగా సత్కరించారు. ఒకేసారి 5 ఉద్యోగాలు సాధించడం గ్రామానికి గర్వకారణమన్నారు. చదువుపై ధ్యాస ఉంచి, తల్లిదండ్రులకు పేరు తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు. ఆర్‌అండ్‌బీ ఏఈ, పాలిటెక్నిక్ లెక్చరర్, గ్రూప్ ఫోర్త్, గ్రౌండ్ వాటర్ ఉద్యోగాలకు ఎంపికయ్యాడు.

విద్యుత్‌షాక్‌తో ఎద్దు మృతి


మృతి చెందిన ఎద్దు

దుద్యాల్: విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి చెందిన ఘటన ఆదివారం మండల పరిధిలోని పోలేపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. బాధితుడు బ్యాగరి ఎల్లప్ప వివరాల ప్రకారం.. రోజు మాదిరిగానే మేతకు విడిచి పెట్టానని, మేత మేస్తూ పొలంలో వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరకు వెళ్లి విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందిదని, విలపించాడు. ఎద్దు విలువ రూ. 50 వేలు ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నారు.

పశువైద్యం.. దైవాదీనం!

మూగజీవాలకు పశువైద్యం అందని ద్రాక్షలా మారింది. పశువైద్యశాలల్లో సిబ్బంది కొరతతో పాటు సరిపడా వసతులు లేక పశువులకు సరైన వైద్యం అందడం లేదు. పశువైద్యశాలల్లో గత కొంతకాలంగా ఖాళీ పోస్టులు భర్తీకి నోచుకోవడం లేదు. దీంతో మూగజీవాలకు సరైన వైద్యం అందక మృత్యువాత పడుతున్నాయి. పశుసంవర్ధక శాఖలో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని పాడి రైతులు కోరుతున్నారు.



వైద్యులు లేని దుద్యాల పశు ఆస్పత్రి

- దుద్యాల్‌లో వైద్యుల కొరత..
- గౌరారంలో మూతబడ్డ ఆస్పత్రి
- అధికంగా డబ్బులు వసూలు చేస్తున్న ప్రైవేట్ వైద్యులు
- డాక్టర్‌ను నియమించాలంటున్న పాడి రైతులు

దుద్యాల్ : పేరుకే మండల కేంద్రం.. వసతులు అంతంత మాత్రమేనని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. మండల పరిధిలోని గౌరారం గ్రామంలో పశువైద్యశాల ఉన్నా డాక్టర్లు లేరు. అసలే వర్షాకాలం పశువులకు, జీవాలకు అనేక వ్యాధులు వస్తుంటాయి. వాటికి వైద్యం చేసేందుకు పశువైద్యశాలలో డాక్టర్లు లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఇటీవలే వీఆర్‌ఓల సర్దుబాటులో ఒక వీఆర్‌ఓను దుద్యాల పశువుల ఆస్పత్రిలో అటెండర్‌గా నియమించారు. ఆయనకు పశువైద్యంపై అవగాహన లేకపోవడంతో చికిత్స చేయలేకపోతున్నాడు. ఏదైనా చిన్న చికిత్సకు సంబంధించి పశువుల ఆస్పత్రికి వస్తే పశువైద్యులను అడిగి చికిత్స చేస్తున్నట్లు రైతులు తెలిపారు. లేదంటే ప్రైవేట్ వైద్యులను సంప్రదించమని పాడి రైతులకు సూచిస్తున్నాడు. అందులో భాగంగానే పశుఆస్పత్రి గోడపై ప్రైవేట్ వైద్యుడి ఫోన్ నంబర్ రాయించాడు. చికిత్స కోసం వచ్చిన ప్రతి ఒక్కరికి ఫోన్ నంబర్‌ను సంప్రదించమని చెబుతున్నాడని రైతులు వాపోతున్నారు. పశువైద్యులు లేక గౌరారం పశువైద్యశాల మూతపడింది. పశువైద్య సేవలు గత కొంతకాలంగా గ్రామంలో అందడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ప్రైవేట్ వైద్యులు చిన్న చిన్న చికిత్సలకు అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారని మండల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేట్ డాక్టర్లు అందుబాటులో లేని సమయంలో పశువులు చనిపోయితున్నాయని ఆయా గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. అందుబాటులో ఉన్న పశువుల ఆస్పత్రిలో డాక్టర్లను నియమిస్తే ప్రైవేట్ డాక్టర్లను సంప్రదించాల్సిన అవసరం లేదని మండలంలోని వివిధ గ్రామాల పాడిరైతులు కోరుతున్నారు.


మూతబడిన గౌరారం ఆస్పత్రి

> **పశు వైద్యులు లేక**
>
> 
>
> మా గేదె ఎదకు వచ్చింది. కృత్రిమ గర్భధారణ కోసం దుద్యాల్‌లోని పశువుల ఆస్పత్రికి వెళ్లాను. అక్కడ పని చేస్తున్న అటెండర్‌కు వైద్యం చేయడం రాకపోవడంతో వెనుదిరాగాను. దీంతో ప్రైవేట్ పశువైద్యుడిని సంప్రదించగా ఆస్పత్రి దగ్గరకు వచ్చి, రెండు కృత్రిమ గర్భధారణ ఇంజెక్షన్ ఇచ్చి రూ. 500 తీసుకున్నాడు. అదే ప్రభుత్వ ఆస్పత్రిలో ఒక్క ఇంజెక్షన్‌కు రూ. 40లకు మాత్రమే తీసుకుంటారు. త్వరగా పశువైద్యులను నియమించాలి.
>
> – వెంకటయ్య, పాడి రైతు, దుద్యాల్

మురికిగా మిషన్ భగీరథ నీరు

- తాగునీటికి ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

కొడంగల్ : శ్రీశైలం నుంచి తాగునీరు కొడంగల్‌కు వస్తుందంటే మొదట్లో అందరూ సంతోషపడ్డారు. కాని, గత కొంతకాలంగా మిషన్ భగీరథ నుంచి బురదనీరు వస్తుంది. ఈ నీరును తాగడానికి ప్రజలు భయపడుతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం అంటురోగాలు వచ్చే అవకాశం ఉంది. నల్లాల ద్వారా కలుషితమై మురికి నీరు రావడం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మిషన్ భగీరథ అధికారులు నీటిని శుద్ధి చేయాల్సిన విధానంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. 300 కిలోమీటర్ల దూరంలో ఉన్న కృష్ణానది బ్యాక్ వాటర్‌ను మిషన్ భగీరథ పథకంలో భాగంగా శుద్ధి చేసి ప్రజలకు సరఫరా చేయాల్సి ఉంది. నియోజకవర్గంలో మహిళల కష్టాలు తీర్చడానికి గత ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది. నియోజకవర్గంలోని కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్ మండలాల్లో ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు రూ.2వేల కోట్లు, కొడంగల్‌కు రూ.267 కోట్లు పెట్టి మిషన్ భగీరథను పూర్తి చేశారు. అయితే, సాంకేతికంగా నీటిని శుద్ధి చేయాల్సి ఉంది. కాని, ఈ మధ్యకాలంలో ఒండ్రునీరు వస్తుందని మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


శుద్ధిలేని మిషన్ భగీరథ నీరు


మిషన్ భగీరథ ప్లాంటు

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

కుల్కచర్ల: మండలంలోని ఇప్పాయిపల్లి గ్రామానికి చెందిన రేణి పెద్ద అంజనేయులు ఆకస్మికంగా మృతి చెందారు.విషయం తెలుసుకున్న గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ నర్సింలు ఆదివారం బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామ పరిధిలోని నిరుపేద ప్రజలకు అండగా ఉంటామని, రాజకీయాలకు అతీతంగా సహాయ సౌకర్యాలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో చిన్న వెంకటయ్య, రాములు, రాములు, నర్సయ్య, రేణి లక్ష్మయ్య, మొగులయ్య, అంజయ్య, బాలకృష్ణ, రామయ్య, రేణి వెంకటయ్య పాల్గొన్నారు.


ఆర్థిక సాయం అందజేస్తున్న నర్సింలు తదితరులు

ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

కొడంగల్ : పట్టణంలో వెలిసిన గురురాఘవేంద్ర స్వామి ఆరాధనోత్సవాల పోస్టర్‌ను బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని పద్మావతీ సమేత మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆవిష్కరించారు. ఈనెల 20, 21, 22 తేదిల్లో ఆరాధనోత్సవాలు జరుగుతాయని బ్రాహ్మణులు తెలిపారు. 20న ఉదయం సుప్రభాతం, పంచామృతాభిషేకం, అష్టోత్తర పారాయణం, తులసీ అర్చన, పల్లకీసేవ, అష్టావధానం, 21న ఉదయం 10 గంటలకు రథోత్సవం, 22న భజన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో డీడీఎస్ జిల్లా అధ్యక్షుడు జయతీర్థాచారీ, బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు కిట్టుస్వామి, అక్కి శ్రీనివాస మూర్తి, లక్ష్మీనారాయణ జోషీ, దత్తుస్వామి, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న బ్రాహ్మణులు

ఘనంగా అమ్మవారి ప్రతిష్ఠాపనోత్సవాలు


బోనాలతో భక్తులు

మోమిన్‌పేట: మండలంలోని కొత్త కోల్కుంద గ్రామంలో భూ లక్ష్మమ్మ దేవత విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా తెల్లవారు జామునుంచే ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ గావించారు. అనంతరం అమ్మవారికి పెద్ద ఎత్తున బోనాలు సమర్పించి, తీర్థప్రసాద వితరణ, సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

కార్గో సేవలతో ప్రయోజనం

కుల్కచర్ల: కార్గో సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంజనేయులు అన్నారు. ఆదివారం మండలంలోని ముజాహిద్‌పూర్ గ్రామపంచాయతీ పరిధిలో నూతనంగా ఆర్టీసీ కార్గో సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్సుల్లో మనకు కావాల్సిన ప్రదేశానికి వస్తువులను పార్సిల్ చేసి కార్గో ద్వారా పంపించడం సులభంగా ఉంటుందన్నారు. ఆన్‌లైన్‌లో మనం పంపించిన వస్తువు ఎక్కడ వరకు వెళ్లిందనే విషయాలను తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగి చంద్రయ్య, మాజీ ఉప సర్పంచ్ చంద్రభూపాల్ రావు, కార్గో సేవల ఇన్‌చార్జి విశ్వనాథ్, స్థానిక నాయకులు అనంతయ్య, శ్యాంరావు, అరవింద్, వెంకటయ్య పులింగ, షర్ఫొద్దిన్, వసంత్, గుండా రాజు పాల్గొన్నారు.


కార్గో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న అధికారులు నాయకులు

పిచ్చిమొక్కల మధ్య సబ్‌స్టేషన్!



పిచ్చిమొక్కల మధ్య కనిపించకుండాఉన్న సబ్‌స్టేషన్

పట్టించుకోని విద్యుత్ ఉన్నతాధికారులు

యాలాల: మండల పరిధిలోని రాఘవపూర్ 33/11 కేవీ సబ్‌స్టేషన్ ఆవరణలో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. సబ్‌స్టేషన్ ఆవరణతో పాటు పవర్ ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో పెరిగిన పిచ్చిమొక్కలతో ప్రమాదం పొంచి ఉంది. ప్రధాన రోడ్డు పక్కనే ఉన్న సబ్‌స్టేషన్‌ను శుభ్రంగా ఉంచుకోవాలనే విషయాన్ని ట్రాన్స్‌కో సిబ్బంది పట్టించుకోకపోవడం వారి నిర్లక్ష్య వైఖరికి అద్దం పడుతుందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సబ్‌స్టేషన్‌లో రాత్రిపూట విధులు నిర్వహించే ఆర్టిజన్ సిబ్బంది విషకీటకాలు, పాములు, తేళ్ల నుంచి భయాందోళన చెందుతున్నారు. ఈ సబ్‌స్టేషన్ నుంచి కోకట్, రాఘవపూర్, బిజ్జారం, అడాల్‌పూర్‌తో పాటు కమాల్‌పూర్, విశ్వనాథ్‌పూర్ తదితర గ్రామాలకు ఫీడర్ల నుంచి విద్యుత్ సరఫరా చేస్తున్నారు. కాగా, సబ్‌స్టేషన్ ఆవరణ మాత్రం పిచ్చిమొక్కలకు నిలయంగా మారింది. ప్రధాన గేటుతో పాటు సబ్‌స్టేషన్‌ను సూచించే సూచిక బోర్డు సైతం పిచ్చిమొక్కల మధ్య కనిపించకుండా పోయింది. అయినా అటు ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది పట్టించుకోకపోవడం స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు స్పందించి పిచ్చిమొక్కలను తొలగించేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

ఆలయ ధర్మకర్తల కమిటీ ఏర్పాటుకు ఆహ్వానం

షాబాద్: మండల కేంద్రంలోని సీతారామచంద్ర స్వామి దేవస్థాన ధర్మకర్తల కమిటీ ఏర్పాటుకు దేవాదాయ శాఖ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎండోమెంట్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెల 31వ తేదీలోపు ఆసక్తి కలిగినవారు దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ రంగారెడ్డి జిల్లా కార్యాలయం (హైదరాబాద్)లో తమ దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఎండోమెంట్ అధికారి శ్రీనివాస్ ఫోన్ నెంబర్ 91939645 1009ను సంప్రదించాలని సూచించారు.

కార్మికులకు న్యాయం చేయండి

కొడంగల్ : నియోజకవర్గంలో మధ్యాహ్న భోజన కార్మికులకు న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో మధ్యాహ్న భోజన కార్మికులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో హరేరామ హరేకృష్ణ చారిటబుల్ ట్రస్టు ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం పెట్టించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు చెప్పారు. ఇలా చేయడం వల్ల కార్మికులకు అన్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ప్రజల పక్షాన ఉంటూ మహిళలకు న్యాయం చేయాలని కోరారు.

సెల్‌ఫోన్ అందజేత


ప్రయాణికురాలికి సెల్‌ఫోన్ అందజేస్తున్నసిబ్బంది

తాండూరు టౌన్: ఆర్టీసీ బస్సులో ఓ ప్రయాణికురాలు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను బస్సు కండక్టర్ ఆమెకు అప్పగించారు. ఆదివారం హైదరాబాద్ నుంచి తాండూరుకు వస్తున్న ఆర్టీసీ బస్సులో ఎక్కిన ఓ ప్రయాణికురాలు ఫోన్‌ను మరిచి తాండూరులో దిగిపోయింది. బస్సు కండక్టర్ శంకర్ ఫోన్‌ను గుర్తించి, డిపో కంట్రోలర్ నర్సింహులు, బీవీఎస్ఎన్ రెడ్డి, డీఎం సురేష్‌కుమార్ ఆదేశానుసారం ప్రయాణికురాలికి సెల్‌ఫోన్‌ను అప్పగించారు.

ప్రజావాణితో లబ్ధి

బంట్వారం: మండల పరిషత్ కార్యాలయంలో నేడు (సోమవారం) నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రాములు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏమైనా సమస్యలుంటే ప్రజావాణిలో ఫిర్యాదు చేయాలన్నారు. ప్రజల సౌలభ్యం కోసం మండల పరిషత్ కార్యాలయాల్లోనే ప్రజావాణి నిర్వహించేలా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ క్రమంలో మండల ప్రజలు కలెక్టరేట్‌కు వెళకుండా ఇక్కడే అర్జీలు అందజేయాలని ఆయన సూచించారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు

మొయినాబాద్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను సాఫ్ట్‌వేర్ సంస్థ ప్రోత్సహించడం అభినందనీయమని అమ్డాపూర్ పాఠశాల హెచ్‌ఎం రేణుక అన్నారు. ఆదివారం నగరంలో సాఫ్ట్‌వేర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వరంలో జరిగిన సమావేశంలో విద్యార్థుల పైచదువుల కోసం ఆర్థిక సహాయం అందజేశారు. పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థినులకు ఇంటర్ విద్యకు ప్రతి సంవత్సరం రూ.25వేల రూపాయల చొప్పున అందజేస్తారని హెచ్‌ఎం తెలిపారు. జెడ్పీ ఉన్నత పాఠశాల అమ్డాపూర్ విద్యార్థినులు శ్రీనిధి, సౌజన్య, స్ఫూర్తిలకు స్కాలర్‌షిప్ అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవళి, ఏఎపీసీ చైర్మన్ అశ్విణి, శ్రీనివాస్, నర్సింహచారి, ఉపాధ్యాయులు గ్రామస్తులు ఉన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

దుద్యాల్: మండల పరిధిలోని హస్నాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997–1998 బ్యాచ్ విద్యార్థులు 26 సంవత్సరాల తరువాత ఆదివారం కలుసుకొని ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఒకరినిఒకరు ఆత్మీయంగా పలకరించుకొని యోగాక్షేమాలు తెలుసుకున్నారు. రోజంతా ఆనందంగా గడిపారు. చాలా సంవత్సరాల తర్వాత అందరం కలవడం చాలా ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులు దశరథ్‌రెడ్డి, శంకర్‌రావు, తిరుమలయ్య చారి హాజరై వారిని దీవించారు.

తాండూరు పట్టణంలో..

తాండూరు టౌన్ : తాండూరు పట్టణంలోని విజయ విద్యాలయ పాఠశాలలో 1985–86 విద్యా సంవత్సరంలో వివిహెచ్ఎస్ పాఠశాలలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 38 ఏళ్ల తర్వాత ఆదివారం పాఠశాల ఆవరణలో కలుసుకున్నారు. ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తూ పలు ప్రాంతాల్లో సెటిల్ అయ్యారు. తాజాగా సమ్మేళనంలో కలుసుకొని ఒకరినొకరు క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నారు. ఆప్యాయంగా పలకరించుకుంటూ అప్పటి మధురస్మృతులను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులైన నారాయణ, సిద్ధన్న, లలితను ఘనంగా సన్మానించారు. అనంతరం తమ వంతు సాయంగా 50 మంది పేద విద్యార్థులకు ఉచితంగా స్కూల్ యూనిఫాంలు పంపిణీ చేశారు.


అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

నిజానంద్ సేవలు మరవలేనివి

తాండూరు రూరల్: మల్కాపూర్ పశువైద్యాధికారి డాక్టర్ నిజానంద్ సేవలు మరవలేనివని మల్కాపూర్ మాజీ సర్పంచు విజయలక్ష్మి పండరి అన్నారు. 11 సంవత్సరాలుగా పని చేసి, పూడూర్ మండలం కంకర్ పశువైద్యాధికారిగా బదిలీపై వెళ్లారు. దీంతో మల్కాపూర్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాల గొర్రెల, మేకల పెంపకందారులు ఆదివారం ఆయనకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జీవాలకు సకాలంలో వైద్య సేవలు అందించారని గుర్తు చేశారు. అనంతరం నిజానంద్‌కు శాలువ పూల మాలతో సన్మానించారు. కార్యక్రమంలో పండరి, రవిసింథే, మాధవరెడ్డి, సాయిలు, నాగార్జున, జగదీష్, పల్లె వెంకటయ్య, నర్సింలు, కాశీనాథ్, భీమయ్య ఉన్నారు.


నిజానంద్‌ను సన్మానిస్తున్న విజయలక్ష్మి, తదితరులు

విద్యారంగ సమస్యలపై పోరాటం

ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, అరుణ్‌కుమార్

చేవెళ్ల: హాస్టల్ విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాటం చేస్తుందని చేవెళ్ల డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, అరుణ్‌కుమార్‌లు డిమాండ్ చేశారు. మండలంలోని ఎస్సీ, బీసీ హాస్టళ్లను ఆదివారం ఎస్ఎఫ్ఐ నాయకులు సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయా హాస్టల్ విద్యార్థులతో ఎస్ఎఫ్ఐ నూతన కమిటీల సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న హాస్టల్ విద్యార్థులకు చెల్లించాల్సిన మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచకపోవటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే హాస్టళ్లలో ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే హాస్టల్ విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ పోరాటం చేస్తుందన్నారు. ఈ సందర్భంగా వేసిన నూతన కమిటీలలో ఎస్సీ బాలుర హాస్టల్‌లో ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడిగా హరిచరణ్, కార్యదర్శిగా విశాల్, బీసీ హాస్టల్ అధ్యక్షుడిగా ఆదిత్య, కార్యదర్శిగా సందీప్‌లను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సమీర్, చందు, భాష, హరిప్రసాద్, రామ్‌చరణ్, నితిన్, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.


నూతన కమిటీ విద్యార్థులతో నాయకులు